సాక్షి
మంచిర్యాల
శుక్రవారం ♦ 9 ♦ మే ♦ 2025



గోదావరి.. జల సిరి

దక్షిణ భారతావనికి, తెలుగు రాష్ట్రాలకు అన్నపూర్ణగా విలసిల్లుతున్న గోదావరినది బాసర గుండా ప్రవహిస్తోంది. నది పరీవాహక ప్రాంతం ఎంతో చూడముచ్చటగా ఉంటుంది. 10లో ▸



గాలి వీస్తే కరెంటు కట్!

బెల్లంపల్లి విద్యుత్ డివిజన్‌లో కొమ్మ తాకినా.. చినుకు రాలినా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. అడ్డగోలు కోతలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 11లో ▸

గరిష్టం/కనిష్టం
37.0 /26.0

వాతావరణం

ఎండల తీవ్రత పెరుగుతుంది. వడగాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. ఆకాశం రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది.

ఇంటర్ ప్రవేశాలకు వేళాయె



ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలకు ఇంటింటా ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

- జిల్లాలో పది ప్రభుత్వ కళాశాలలు
- ఈ నెల 31వరకు దరఖాస్తుల స్వీకరణ
- అనుబంధ గుర్తింపు లేకుండా 'ప్రైవేటు'లో ప్రవేశాలు

మంచిర్యాలఅర్బన్: విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నెల ఒకటి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా.. 31వరకు దరఖాస్తులకు తుది గడువు విధించింది. పదో తరగతి పరీక్షల ఫలితాలు ఇటీవల విడుదల కాగా జిల్లాలో 8,861మంది ఉత్తీర్ణత సాధించారు. అఫ్లియేషన్ ఉన్న కళాశాలల్లోనే చేరాలని విద్యార్థులకు అధికారులు సూచిస్తున్నారు. అఫ్లియేషన్ ఉన్న.. లేని కళాశాలల వివరాలు మాత్రం వెబ్‌సైట్‌లో సూచించలేదు. అఫ్లియేషన్ ఉన్న కళాశాలల జాబితా అందుబాటులోకి రావాలంటే మరికొంత సమయం పట్టే వీలుందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లకు కళాశాల అధ్యాపకులు ఇంటింటా తిరుగుతూ వివరాలు సేకరిస్తూ ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఒకట్రెండు రోజుల్లో ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదుకు లాగిన్ ఇవ్వొచ్చని అధికారులు తెలిపారు.

జిల్లాలో..

జిల్లాలో 10 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. వీటిలో మంచిర్యాల, మందమర్రి, కాసిపేట, చెన్నూర్, బెల్లంపల్లి(బాలికల), బెల్లంపల్లి, జైపూర్, జన్నారం, లక్సెట్టిపేట, లక్సెట్టిపేట(బాలుర) కళాశాలలు ఉన్నాయి. ఒక్కో సెక్షన్‌లో 44మందిని మాత్రమే చేర్చుకోవాలి. ఒక్కో కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీలో 88 సీట్ల చొప్పున భర్తీ చేయనున్నారు. 352మందికి ప్రవేశాలు కల్పిస్తారు. మంచిర్యాల, బెల్లంపల్లిలో ఇంగ్లిష్ కళాశాలల్లో మరో 352 సీట్లు అదనంగా ఉంటాయి.

అఫ్లియేషన్ ఉంటేనే..

అఫ్లియేషన్ ఉన్న కళాశాలల్లోనే చేరాలని ప్రభుత్వం సూచిస్తోంది. ప్రభుత్వ కళాశాలలకు ఫైర్‌సేఫ్టీ పరికరాలను బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ సరఫరా చేసింది. సానిటైజేషన్, స్ట్రక్చరల్ సౌండ్‌నెస్ సర్టిఫికెట్ సమర్పిస్తే సరిపోతుంది. ప్రైవేటు జూనియర్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు(అఫ్లియేషన్)నకు అన్ని సౌకర్యాలు ఉంటేనే అనుమతి ఇస్తారు. నిబంధనల ప్రకారం నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ), ఆటస్థలం, అగ్నిమాపక అనుమతులు, కాలుష్యం, శబ్ద నియంత్రణ, భవనం పటిష్టత, ట్రాఫిక్ తదితర ధ్రువీకరణ పత్రాలు, బోధకులు, సిబ్బంది వివరాలు ఉంటేనే అనుబంధ గుర్తింపు లభిస్తుంది. కొన్ని కళాశాలల్లో ఫైర్ సేఫ్టీ లేకపోవడం, మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ ఉండడం ప్రధాన సమస్య కాగా, అఫ్లియేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరిస్తుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సేల్ డీడ్ అగ్రిమెంటు వంటివాటితో ప్రభుత్వానికి అఫ్లియేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అన్ని కళాశాలల యాజమాన్యాలు రిజిస్ట్రేషన్ చేసుకుని అనుమతుల కోసం వేచి చూస్తూనే ప్రవేశాలు చేపడుతున్నాయి.

గుర్తింపు లేకుండానే ప్రవేశాలు..

జిల్లాలో అనుబంధ గుర్తింపు లేకుండానే కళాశాలల్లో ప్రవేశాలు చేపడుతున్నారు. తమ కళాశాలల్లో ముందు చేరితే ఫీజుల్లో రాయితీ ఇస్తామంటూ విద్యార్థులు, తల్లిదండ్రుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఏయే కళాశాలలకు అనుమతులున్నాయో..? లేని కళాశాలు ఎన్నో స్పష్టత లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులను అయోమయంలోకి నెడుతోంది.

నిబంధనలు పాటించాల్సిందే

ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలి. ప్రైవేట్ కళాశాలల పునరుద్ధరణకు దరఖాస్తులు మాత్రమే సమర్పించాయి. అన్ని అనుమతులు ఉంటేనే అఫ్లియేషన్ ఇస్తారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కళాశాలల అనుమతులున్నాయా..? లేదా చూశాకే ప్రవేశం పొందాలి. సందేహాలుంటే డీఐఈవో కార్యాలయంలో సంప్రదించవచ్చు.

– అంజయ్య, డీఐఈవో, మంచిర్యాల

నల్లబ్యాడ్జీలతో జర్నలిస్టుల నిరసన



మంచిర్యాల ఐబీ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

- 'సాక్షి' ఎడిటర్ ఇంటిపై పోలీసుల దాడిని ఖండిస్తున్నాం
- టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు డేగ సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రూపిరెడ్డి ప్రకాశ్‌రెడ్డి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా విజయవాడలోని 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసానికి వెళ్లి భయాందోళనలకు గురిచేసేలా ఆంధ్రప్రదేశ్ పోలీసులు వ్యవహరించడంపై జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు డేగ సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రూపిరెడ్డి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నిజాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్తున్న క్రమంలో జర్నలిస్టులను భయపెట్టి అదుపులోకి తీసుకురావాలన్న ఏకైక లక్ష్యంతో ఏపీ పోలీసుల తీరు ఉందని విమర్శించారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లోకి వ్యూహాత్మకంగా చొరబడిన పోలీసులు పూర్తిస్థాయి తనిఖీలు జరిపారని అన్నారు. తనిఖీల్లో ఎలాంటి వ్యతిరేక ఆధారాలు లభించలేదని, కేవలం రాజకీయ కక్ష పూరిత కుట్రలో భాగంగానే ఎడిటర్‌ను ఇబ్బంది పెట్టడానికే ఈ తనిఖీలు జరిపారని ఆరోపించారు. జర్నలిస్టులు, ఎడిటర్లను నియంత్రించడానికి పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు మతిలేని చర్యగా భావిస్తున్నామని అన్నారు. తనిఖీల పేరు చెప్పినా అది దాడిగానే భావిస్తున్నామని, ఏపీ పోలీసుల తీరును అన్ని యూనియన్లు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయని అన్నారు. ఏపీలో జర్నలిస్టులపై పోలీసుల వేధింపులను తక్షణమే నిలిపివేయాలని, లేనిపక్షంలో జాతీయ స్థాయిలో నిరసన కార్యక్రమాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి పింగళి సంపత్‌రెడ్డి, ఐజేయూ సభ్యుడు కాచం సతీశ్, 'సాక్షి' బ్యూరో ఇన్‌చార్జి ఆకుల రాజు, జర్నలిస్టులు రమేశ్‌రెడ్డి, రాజలింగు, లింగారెడ్డి, శ్రీనివాస్, దేవరాజ్, రాజేశ్, శ్రీనివాస్, రవి, రాజు, బాబురావు, నర్సయ్య పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బ్యాంకు లింకేజీలో జిల్లాకు ఉత్తమ అవార్డు



అవార్డు, ప్రశంసాపత్రాలు అందిస్తున్న మంత్రి సీతక్క, సీఈవో దివ్య

పాతమంచిర్యాల: బ్యాంకు లింకేజీలో జిల్లాకు ఉత్తమ అవార్డు లభించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.464 కోట్లు గ్రామైక్య మహిళా సంఘాలకు రుణంగా అందించినందుకు జిల్లా రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. గురువారం హైదరాబాద్‌లోని బేగంపేట్‌లో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్‌కుమార్, సీఈవో దివ్య చేతుల మీదుగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎస్.కిషన్, అదనపు డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు, డీపీఎం స్వర్ణలత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అనిత అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అధికారులు అవార్డులు అందుకోవడంపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. అవార్డులు అందుకున్న అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏపీఎం శ్యామల, సీసీ సత్యనారాయణ, సెర్ప్ ఉద్యోగులు పాల్గొన్నారు.

59,449మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో యాసంగి ధాన్యం సేకరణకు ఏర్పాటు చేసిన 242 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 7,119 మంది రైతుల నుంచి 59,449 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.37.13 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుంచి కరీంనగర్ జిల్లాలోని 58 రైస్‌మిల్లులకు, జిల్లాలోని 14 మిల్లులకు తరలించామని పేర్కొన్నారు. రైతులు ఆటోమెటిక్ యంత్రంలో శుభ్రం చేసి నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని సూచించారు. ప్రతీరోజు రూ.3 నుంచి రూ.5కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు.

ముందస్తు రక్తపరీక్షలతో తలసేమియా నియంత్రణ



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

పాతమంచిర్యాల: మేనరిక వివాహాల నియంత్రణ, ముందస్తు రక్త పరీక్షలతో తలసేమియా వ్యాధిని నియంత్రించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. గురువారం ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి వద్ద తలసేమియా అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తలసేమియా వ్యాధి జన్యుపరమైనదని, తల్లిదండ్రులకు ఇద్దరికీ ఉంటే పిల్లలకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రక్తదానం తలసేమియా రోగులకు జీవాధారమని, తలసేమియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి డివిజన్ల డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ అనిత, డాక్టర్ సుధాకర్‌నాయక్, ప్రోగ్రాం అధికారి అనిల్, జీజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ శ్రీధర్, వైద్యాధికారులు శివప్రతాప్, స్నేహిత, అశోక్, అమన్, రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు భాస్కర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మహేందర్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులను ఎంపిక చేయాలి

జన్నారం: రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులను ఎంపిక చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ టీబీసీ డీవో పురుషోత్తంనాయక్, ఎంపీడీవో ఉమర్ షరీఫ్‌లతో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 3,864 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇందులో ఎస్సీలు 1,228మంది, ఎస్టీలు 529 మంది, బీసీలు 1,882 మంది, మైనారిటీలు 168 మంది, క్రైస్తవులు ముగ్గురు, ఈబీసీ 52 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మహిళలకు 25శాతం, వికలాంగులకు 5శాతం ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఎన్‌కౌంటర్ మృతుల్లో బండి ప్రకాష్..?

- మావోయిస్టు అగ్రనేతల్లో ఒకరు
- ప్రభాత్‌పై రూ.25 లక్షల రివార్డు
- స్థానికంగా సర్వత్రా చర్చ



బండి ప్రకాష్ (ఫైల్)

మందమర్రిరూరల్: తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన కర్రి గుట్టల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యుడు, సికాస కార్యదర్శి బండి ప్రకాష్ అలియాస్ దాదా అలియాస్ క్రాంతి అలియాస్ ప్రభాత్(60) మృతిచెందాడనే వార్త స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసు అధికారులు ధ్రువీకరించకపోవడంతో అసలు మృతిచెందాడా..? లేదా అనే విషయమై స్పష్టత రావాల్సి ఉంది. మందమర్రి పట్టణంలోని సింగరేణి కార్మికుడైన బండి అమృతమ్మ, రామారావు దంపతులకు కూతురు ప్రమీల, కుమారులు నర్సింగరావు, ప్రకాష్, వెంకటేశ్వర్లు ఉన్నారు. రెండో కుమారుడు ప్రకాష్ 1982–84 మధ్య అప్పటి పీపుల్స్‌వార్ అనుబంధ విద్యార్థి సంఘమైన రాడికల్ స్టూడెంట్ యూనియన్(ఆర్ఎస్‌యూ) కార్యకలాపాలు చురుగ్గా నిర్వహించే సమయంలో పలు చోట్ల సమావేశాలకు ఆకర్షితుడయ్యాడు. 1984లో స్థానిక ఏఐటీయూసీ నేత వీటీ అబ్రహం హత్య కేసులో నిందితుడు కావడంతో ఆదిలాబాద్ సబ్ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. అక్కడి నుంచి నేతలు హుస్సేన్, నల్లా ఆదిరెడ్డిలతో కలిసి సబ్ జైలు నుంచి తప్పించుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వం మావోయిస్టులతో శాంతిచర్చలకు పిలుపునివ్వడంతో ఆసిఫాబాద్ సమీపంలోని ముళ్వడలో భారీ బహిరంగ సభకు అధ్యక్షత వహించాడు. శాంతి చర్చలు విఫలం కావడంతో మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లాడు. సింగరేణి కార్మికులకు 4, 5 వేజ్‌బోర్డుల అమలు కోసం చేపట్టిన 56రోజుల సమ్మెలో సికాస కీలకపాత్ర పోషించడంతోపాటు సింగరేణి చర్చల్లో పాల్గొన్నారు. ఎండ్లబండ్ల కార్మికులు, సఫాయి, టింబర్‌యార్డ్‌ల్లో పని చేసే కాంట్రాక్ట్ కార్మికుల పర్మినెంట్ విషయంలో కీలకపాత్ర పోషించారు. సింగరేణి కార్మికుల సమస్యలపై అధికారుల ఆగడాలపై అనేకసార్లు సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస) ప్రభాత్ పేరిట ప్రకటనలు జారీ చేసేవారు. సుమారు 41ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లిన ప్రకాష్‌పై తెలంగాణ ప్రభుత్వం రూ.25లక్షల రివార్డు ప్రకటించింది. ఆయనకు భార్య హేమ, కుమారుడు కిరణ్ ఉన్నారు. ఏదేమైనా ఇంతవరకు ప్రకాష్ మృతి విషయంలో సంబంధిత పోలీసులు ధ్రువీకరించలేదు.

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్య, పూర్తిస్థాయి మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. గురువారం స్థానిక సైన్స్ కేంద్రంలో మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ కార్యక్రమాలను ప్రతీ విద్యార్థి పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా బాధ్యత తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు, భయం, ఒత్తిడి లేకుండా విద్య నేర్చుకునే అవకాశం కల్పించడానికి సమన్వయంతో విధులు నిర్వర్తించాలని తెలిపారు. సమయానికి పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ అందేలా చూడాలన్నారు. రాబోయే విద్యాసంవత్సరంలో అమలు చేయాల్సిన వినూత్న కార్యక్రమాలు అవగాహన కలిగి ఉండాలఅన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష కో–ఆర్డినేటర్లు చౌదరి, యశోధర, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, డీసీఈబీ సెక్రెటరీ మహేశ్వర్‌రెడ్డి, ఏఎస్పీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులకు సౌకర్యాలు కల్పించాలి

లక్సెట్టిపేట: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తూరు, ఇటిక్యాల, మోదెల, చందారం, కొమ్ముగూడెం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎలాంటి ఇబ్బందులున్నా తెలియజేయాలన్నారు. ధాన్యాన్ని శుభ్రపరిచి తీసుకురావాలని, నాణ్యమైన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని, నాణ్యమైన ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేస్తున్నాయ్

- అవసరమైనవి 3,73,820
- చేరినవి 1,95,360



బుక్‌డిపోలో నిల్వ ఉంచిన పాఠ్యపుస్తకాలు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేసే ఉచిత పాఠ్య పుస్తకాలు జిల్లా బుక్‌డిపోకు చేరాయి. వేసవి సెలవుల్లోనే గుడిపేటలోని బుక్‌డిపోకు సరఫరా అవుతుండగా.. బడులు తెరిచే నాటికి విద్యార్థులకు అందించేందుకు చర్యలు వేగవంతం చేశారు. ప్రతీసారి వేసవి సెలవుల్లోనే పాఠ్యపుస్తకాలు జిల్లా కేంద్రాలకు సరఫరా చేస్తుండగా.. ఈసారి విద్యాసంవత్సరం ముగింపునకు ముందే సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే పాఠశాలల బలోపేతం, విద్యాప్రమాణాల పెంపుపై దృష్టి సారించింది. అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తోంది. ఏఐ పాఠాల బోధన సాగనుంది. విద్యార్థుల యూనిఫాం క్లాత్ జిల్లాకు చేరగా.. కుట్టు పని కోసం మహిళా సమాఖ్య సభ్యులకు అందజేశారు. జిల్లాకు 3,73,820 ఉచిత పాఠ్యపుస్తకాలు అందించాల్సి ఉంది. ఇందులో 66శాతం పుస్తకాలు జిల్లా బుక్‌డిపోకు వచ్చాయి. ఇప్పటివరకు 1,95,360 పుస్తకాలు జిల్లాకు చేరగా.. 1,12,460 పుస్తకాలు రావాల్సి ఉంది. ప్రతీ తరగతికి ఒక్కో సబ్జెక్టు పాఠ్య పుస్తకం రావాల్సి ఉంది. పూర్తి స్థాయిలో వచ్చాక ఎంఈవో కార్యాలయాలకు చేరవేస్తారు. అక్కడి నుంచి పాఠశాలలకు పంపిస్తారు. కొత్త పుస్తకాల్లో తెలంగాణ తల్లి చిత్రంతోపాటు రాష్ట్ర గీతం ప్రచురించారు. గత ఏడాది మిగిలిన దాదాపు 12వేల పుస్తకాలు వెనక్కి పంపించాలా..? పాఠశాలలకు సరఫరా చేయాలా..? వద్దా అనేది ఉన్నతాధికారుల నుంచి స్పష్టత లేకుండాపోయింది. కొత్త పాఠ్యపుస్తకాలను క్యూఆర్ కోడ్‌తో ముద్రిస్తున్నారు. బయట మార్కెట్‌కు తరలిపోకుండా చర్యలు తీసుకుంటున్నారు.

అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి

- అనుమానితుల సమాచారం పోలీసులకు చేరవేయాలి
- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా
- ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాలక్రైం: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు 24గంటలూ అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం కమిషనరేట్ సమావేశ మందిరంలో రెండు జిల్లాల పోలీస్ అధికారులు, సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, ప్రధానమైన ఇండస్ట్రియల్ సంస్థల అధికారులతో ఆపరేషన్ సిందూర్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఇండియా, పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. రక్షణపరంగా వ్యూహాత్మకంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమాచారం వ్యవస్థను ఏర్పాటు చేసుకుని నిరంతర నిఘా పెంచాలని తెలిపారు. ముష్కరులు ఏ రూపంలోనైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించిన, ప్రజలకు ఇబ్బంది కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయాలని, నిరంతర నిఘా కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీపీలు భాస్కర్, కరుణాకర్, అదనపు డీసీపీ రాజు, సింగరేణి, ఎన్‌టీపీసీ, జిల్లా ఫైర్ అధికారులు సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



పూలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



సంబరాల్లో బీఆర్ఎస్ నాయకులు

పాతమంచిర్యాల: ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రమూకలను అంతమొందించిన భారత సైన్యాన్ని, ప్రధాని మోదీని అభినందిస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం, భారత త్రివిధ దళాల సైనికుల విగ్రహాలకు పూలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, సీనియర్ నాయకుడు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ దేశ ప్రజలంతా భారత సైన్యానికి అండగా ఉన్నారని తెలిపారు. ఈ సమయంలో రాజకీయ పార్టీలు రాజకీయాలను అతీతంగా కేంద్ర ప్రభుత్వానికి, భారత సైన్యానికి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాసం వద్ద సంబరాలు

ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన భారత ఆర్మీకి అభినందనలు తెలుపుతున్నామని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. గురువారం భారత ఆర్మీని అభినందిస్తూ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్‌రావు, తాజామాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అర్హులకు రుణ సదుపాయం కల్పిస్తోందని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.చంద్రకళతో కలిసి రాజీవ్ యువ వికాసం అక్షరాస్యత(నిల్ప్), ఎస్ఎస్‌సీ ఫలితాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. అక్షరాస్యత కార్యక్రమంలో జిల్లాలోని కాసిపేట మండలాన్ని ఎంపిక చేసుకుని 100శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని, ఇదే స్ఫూర్తితో అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్ ఈడీ దుర్గప్రసాద్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి, మైనార్టీ సంక్షేమ అధికారి రాజేశ్వరి, పురుషోత్తం, గిరిజన సంక్షేమశాఖ అధికారి జనార్దన్ పాల్గొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ

మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ డిపార్ట్‌మెంట్(టాస్క్) ద్వారా ఉపాధి సామర్థ్యాన్ని పెంచే నైపుణ్య శిక్షణ అందిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో టాస్క్‌లో శిక్షణ పొందుతున్న అభ్యర్థుల సమావేశానికి టాస్క్ అధికారి సాయికుమార్‌తో కలిసి హాజరయ్యారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 30 రోజులపాటు యువతకు పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలను అందించి ఉపాధి అవకాశాలను పెంపొందిస్తామని తెలిపారు. శిక్షణ మొదటి విడతలో 40 మంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంట మార్పిడితో సుస్థిర ఆదాయం



మొక్కలు నాటుతున్న శాస్త్రవేత్తలు

నెన్నెల: రైతులు పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధిస్తూ సుస్థిర ఆదాయాన్ని పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ శివకృష్ణ అన్నారు. మండలంలోని ఖర్జిలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా గురువారం రైతులకు అవగాహన కల్పించారు. రైతులు సాంకేతిక విషయాలను అవలంబిస్తూ కొత్త వంగడాలను సాగు చేయాలని సూచించారు. పురుగుల మందులు, ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేసి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని అన్నారు. తక్కువ యూరియా వాడకం, సాగు ఖర్చులు తగ్గించడం, రోగాలను భద్రపర్చి నష్టపరిహారాన్ని పొందడం, తదితర అంశాల పై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ సురేఖ మాట్లాడుతూ రైతులు వరి, పత్తి పంటలు మాత్రమే కాకుండా ఇతర పంటలు కూడా సాగు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మర్ ఐడీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ స్రవంతి, నాగరాజు, నెన్నెల ఏఓ సృజన, ఏఈఓ రాంచందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం



ప్రశాంత్ (ఫైల్)

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన బైండ్ల ప్రశాంత్ (32) దివ్యాంగుడు గత 22న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు తమ బంధువుల ఇళ్లలో, తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం అతని తండ్రి ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సుప్రియ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712659521, 8712659519 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

సైద్‌పూర్‌లో యువతి..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రకు చెందిన యువతి (18) పక్షం రోజుల క్రితం సాత్నాల మండలంలోని సైద్‌పూర్‌లో గల అమ్మమ్మ ఇంటికి వచ్చింది. గురువారం ఆదిలాబాద్ పట్టణంలో ఉండే తన బంధువుల ఇంటికి వచ్చిన తర్వాత చిన్నమ్మ ఇంటికి వెళ్తానని చెప్పి బయల్దేరి వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సఖీ సెంటర్ ముందున్న ఓ పాన్‌షాప్ ఎదుట బుధవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. స్థానికులు గమనించి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతునికి 35 ఏళ్ల వరకు ఉంటుందని, తలకు ఎర్రటి రుమాల్, ఛాతిపై త్రిశూలం పచ్చబొట్టు వేసి ఉందని సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



సంఘటన స్థలంలో గాయపడిన ఇర్ఫాన్

నర్సాపూర్(జి): మండలంలోని అర్లి(కే) ఎక్స్‌రోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన ఇర్ఫాన్ ద్విచక్ర వాహనంపై లోకేశ్వరం వెళ్లి వస్తుండగా కాలినడకన వస్తున్న ఖానాపూర్‌కు చెందిన మహమ్మద్ హసీబ్ ఖాన్‌ను ఢీకొట్టాడు. ఇద్దరికి గాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇర్ఫాన్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు నిజామాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

భీమారం: అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు. మట్టితరలిస్తున్న ట్రాక్టర్లను ఆపి విచారించగా ఎలాంటి అనుమతి పత్రాలు లేవని డ్రైవర్లు అనపర్తి మధుకర్, ఇస్లావత్ శివరాం ఒప్పుకున్నారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. మధుకర్, శివరాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోదావరి.. జల సిరి

దక్షిణ భారతావనికి తెలుగు రాష్ట్రాలకు అన్నపూర్ణగా విరాజిల్లుతున్న గోదావరినది బాసర గుండా ప్రవహిస్తోంది. సముద్రమట్టానికి 3,018 అడుగుల ఎత్తున గల పర్వత సానువుల్లో సన్నని ధారలా ప్రవహిస్తూ తెలుగు రాష్ట్రాల్లో దూసుకెళ్తోంది. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా త్రియంబకేశ్వర్ వద్ద బ్రహ్మగిరి పర్వతం నుంచి గోదావరి నది ప్రవహిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల గుండా ప్రజలకు తాగు, సాగునీటిని అందిస్తోంది. నది పరీవాహక ప్రాంతం ఎంతో చూడముచ్చటగా ఉంటుంది. నది ఒడ్డున ఎన్నో ఆధ్యాత్మిక కేంద్రాలు ఉన్నాయి. – భైంసా

- బాసర నుంచే దక్షిణ గంగ ప్రారంభం
- నదీ తీరంలో అనేక పుణ్యక్షేత్రాలు
- వేలాది ఎకరాలు సస్యశ్యామలం
- లక్షల మందికి ఉపాధి

సమ్మర్ స్పెషల్



గోదావరి నది

ఒడ్డునే అనేక ఆలయాలు...

గోదావరి నది పరీవాహక ప్రాంతాల్లో అనేక ఆలయాలు, నగరాలు కనిపిస్తాయి. మహారాష్ట్రలో నాసిక్, కొద్ది దూరంలోనే షిర్డీ, పక్కనే ఔరంగాబాద్, జాల్నా, మరోవైపు మనకు సమీపంలో నాందేడ్‌లోని సచ్‌కండ్ గురుద్వారాలు, గోదావరి నది ఒడ్డునే నిర్మితమయ్యాయి.

మన ప్రాంతంలో...

స్కందుడు నడియాడిన కందకుర్తి వద్ద మంజీర, హరిద్ర నదులను కలుపుకుని త్రివేణి సంగమంగా మారి బాసర వైపు గోదావరి ప్రవాహం కనిపిస్తుంది. నది ఒడ్డునే సరస్వతీ అమ్మవారి ఆలయం, లోకేశ్వరం మండలంలో బ్రహ్మేశ్వర ఆలయం, దిలావర్‌పూర్ మండలం సాంగ్వీలో సంగమేశ్వర ఆలయం, ధర్మపురి నరసింహస్వామి ఆలయం, గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం నది ఒడ్డునే ఉన్నాయి.

ఆధ్యాత్మిక కేంద్రాల వద్ద పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులకు గోదావరి నది కనువిందు చేస్తుంది.

ఎంతోమందికి ఉపాధి...

శుభ, అశుభ కార్యాల్లోనూ నది పరివాహక ప్రాంతాల్లో ఉండేవారంతా దక్షిణగంగగా కొలుచుకునే గోదావరి నదిలోనే పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఇక్కడ ఉండే బ్రాహ్మణులు, బోట్లు తిప్పే వారికి ఉపాధి తెచ్చిపెడుతుంది. గోదావరి నది పొడవున జాలర్లు రోజూ చేపలు పట్టి జీవనం వెళ్లదీస్తున్నారు. మహారాష్ట్ర నుంచి రెండు తెలుగు రాష్ట్రాల వరకు గోదావరి నదిపై ఎన్నో చోట్ల రోడ్డు, రైలు వంతెనలు కనిపిస్తాయి.

సాగునీరందిస్తూ...

మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి హయాంలో పైథాన్ వద్ద జయక్‌వాడీ ప్రాజెక్టు నిర్మించారు. ఇది ఔరంగాబాద్, జాల్నా, పర్బని జిల్లాల్లో 2,37,452 హెక్టార్ల భూమికి సాగునీరు అందిస్తోంది. మహారాష్ట్రలో సాగయ్యే చెరుకు పంటకు గోదావరి నది నీరే ఆధారం. మహారాష్ట్రలోని ఔరంగాబాద్, పర్బనీ, జాల్నా, నాందేడ్ జిల్లాల ప్రజలకు తాగునీటిని అందిస్తూ మన సరిహద్దులో బాబ్లీ ప్రాజెక్టు నుంచి బాసర వైపు ఈ నది ప్రవాహం కనిపిస్తుంది. ఉత్తర తెలంగాణకు పట్టెడు అన్నం పెట్టే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గోదావరి నదిపైనే నిర్మించారు. ఉత్తర తెలంగాణలో 18 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి వరి పంట పండేందుకు ఈ నీరే ప్రధానం. ఇక మిషన్ భగీరథలో భాగంగా నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు ఈ నది నుంచే తాగునీటిని అందిస్తారు.

అరేబియా సముద్రానికి 80 కిలోమీటర్ల దూరంలో బ్రహ్మగిరిపై బిందువుగా మొదలైన గోదావరి నది తూర్పువైపునకు 1,465 కిలోమీటర్ల మేర సాగి బంగాళాఖాతంలో ముగుస్తుంది. తెలంగాణ వాసుల కల్పతరువు,

సముద్రంలో కలిసి...

ఆంధ్రుల అన్నపూర్ణగా పిలిచే గోదావరి నది నీటి ప్రవాహం కాళేశ్వరం గుండా భద్రాచలం మీదుగా ఉభయ గోదావరి జిల్లాల్లోకి ప్రవేశిస్తుంది. చివరగా ఒక పాయ యానం వద్ద మరొకటి అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి చెంత సముద్రంలో కలిసిపోతుంది.

జాతీయస్థాయి పోటీలకు రెఫరీగా ఎంపిక



కళ్యాణ్

పాతమంచిర్యాల: జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు రెఫరీగా జుమ్మిడి కళ్యాణ్ ఎంపికైనట్లు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకు తమిళనాడులోని తిరువన్నమలైలో నిర్వహించనున్న హెచ్‌ఐ 40 సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ పోటీలకు మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలానికి చెందిన కళ్యాణ్ న్యాయనిర్ణేతగా వ్యవహరించనున్నట్లు వారు పేర్కొన్నారు.

వడ్డీ వ్యాపారిపై కేసు నమోదు

ఇంద్రవెల్లి: అనుమతి లేకుండా వడ్డీ వ్యాపారం చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ జిల్లాకు చెందిన చిన్నం ధర్మేందర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు గురువారం సాయంత్రం ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఏపీలోని కొనసీమ జిల్లాకు చెందిన ధర్మేందర్‌రెడ్డి పట్టుబడినట్లు తెలిపారు. అతన్ని తనిఖీ చేయగా రూ.11,750 నగదు, ఫైనాన్స్ చీటీలు, రిజిస్టర్లు దొరికినట్లు తెలిపారు. వాటితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకుని తెలంగాణ ఏరియా మనీలెండర్‌యాక్ట్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆదివాసీ, గిరిజనులకు శిక్షణ తరగతులు

- రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్



మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్, ఎమ్మెల్యే బొజ్జు

జన్నారం: ఆదివాసీలు, గిరిజనులను అన్ని రంగాల్లో చైతన్యపర్చడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని, ఇందులో భాగంగా జన్నారంలో ఆదివాసీ, గిరిజన నాయకులకు మూడు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని మండలాల నుంచి ముగ్గురు చొప్పున ఎంపిక చేసిన ఆదివాసీ, గిరిజనుల కాంగ్రెస్ ప్రతినిధుల శిక్షణ తరగతుల కార్యక్రమం ఈ నెల 11, 12, 13వ తేదీల్లో మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఏర్పాట్లను గురువారం వారు పరిశీలించారు. శిక్షణ తరగతుల ప్రారంభానికి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, రాష్ట్ర నేతలు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి, కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జి ఆత్రం సుగుణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పొనకల్ సింగల్ విండో చైర్మన్ అల్లం రవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజఫర్, పార్టీ సీనియర్ నేతలు గుర్రం మోహన్‌రెడ్డి, సయ్యద్ ఇసాక్, ఆర్.రమేష్‌రావు, ఇందయ్య, టౌన్ ప్రెసిడెంట్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల షెడ్యూల్ విడుదల

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, ఒకేషనల్ తదితర కోర్సుల్లోని 2, 4, 6 సెమిస్టర్ల, బ్యాక్‌లాగ్ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ల పరీక్షల టైంటేబుల్‌ను గురువారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి కే.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

సెమిస్టర్ల వారీగా ఇలా..

- రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 14, 16, 19, 21, 23, 26, 28, 30 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు నిర్వహిస్తారు.
- నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 15, 17, 20, 22, 24, 27, 29, 31, జూన్ 4న ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారు.
- ఐదవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 17, 20, 22, 24, 27, 29, 31, జూన్ 4, 10, 11, 12, 13, 16వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటాయి.
- 6వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 14, 16, 19, 21, 23, 26, 28, 30, జూన్ 3, 5, 11, 12, 13 తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారు.
- మొదటి సెమిస్టర్ పరీక్షలు జూన్ 17, 18, 20, 21, 23, 24, 25వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయి.
- మూడవ సెమిస్టర్ పరీక్షలు జూన్ 16, 17, 18, 19, 20, 21, 23, 24, 25వ తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఉంటాయి.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

లింగాపూర్(ఆసిఫాబాద్): మండలంలోని రావునూర్ సమీపంలో ఈనెల 7న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన చోర్‌పల్లికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మర్సుకోల ప్రకాశ్ (39) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాపూర్ మండలం రావునూర్‌కు చెందిన ఆత్రం భీంరావు, మారుబాయి దంపతులు బుధవారం గ్రామ సమీపంలోని చేను వద్ద పనిచేసి కాలినడకన ఇంటికి బయలుదేరారు. అదే సమయంలో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రకాశ్ లింగాపూర్ నుంచి బైక్‌పై స్వగ్రామమైన చోర్‌పల్లికి వస్తుండగా రావునూర్ సమీపంలో ఆత్రం భీంరావును ఢీకొట్టాడు. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో జైనూర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఉట్నూర్, ఆ తర్వాత ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. ప్రకాశ్ పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆత్రం భీంరావు భార్య మారుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. మృతునికి భార్య రేణుకాబాయి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో వేధించిన యువకుడి అరెస్ట్

గుడిహత్నూర్: ఇన్‌స్టాగ్రామ్ ఫేక్ ఐడీ క్రియేట్ చేసి ఓ యువతిని వేధింపులకు గురిచేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన గోపాల్ ఓ మహిళ పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ ఐడీ క్రియేట్ చేసి మరో యువతి పరువు తీసేలా అసత్య ప్రచారం చేశాడు. విషయం తెలుసుకున్న సదరు బాధితురాలు షీటీంకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి ప్రాథమిక సాంకేతిక ఆధారాలు పరిశీలించి నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. సోషల్ మీడియాలో ఇతరుల మనో భావాలు దెబ్బతీసేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్పీ పేర్కొన్నారు.

రౌడీషీటర్ రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడకు చెందిన రౌడీషీటర్ కద్దుపై గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 6న సాయంత్రం వినాయక్‌చౌక్‌లో బంగారుగూడకు చెందిన మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు తనతో రావాలని వేధించాడు. మహిళతో ఉన్న ఆమె తమ్ముడిపై కత్తితో దాడి చేశాడు. దీంతో బాధితుడు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు మహిళను వేధించిన కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో రౌడీషీటర్ కద్దు రెండు మర్డర్ కేసులతో పాటు పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు వివరించారు.

అగ్నిప్రమాదంలో కొట్టం దగ్ధం



మంటల్లో కాలుతున్న కొట్టం

బోథ్: మండల కేంద్రంలోని సెరె గుండయ్యకు చెందిన కొట్టం బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు రాత్రి 9 గంటల ప్రాంతంలో చేనులో మంటలు చెలరేగి కొట్టానికి అంటుకున్నాయి. గమనించిన స్థానిక రైతులు సమాచారం అందించడంతో వెళ్లి చూడగా అప్పటికే కొట్టం పూర్తిగా కాలిపోయింది. అందులో ఉన్న వ్యవసాయ పరికరాలు, పనిముట్లు, సామగ్రి దగ్ధమయ్యాయి. వాటి విలువ రూ.3 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ బాధిత రైతు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశాడు.

అభిమన్యు గ్రూప్‌కు అరుదైన గౌరవం




ప్రశంసపత్రం అందుకుంటున్న శేఖర్

నార్నూర్: బడుగు, బలహీన వర్గాల ప్రజలకు 'నేనున్నాను' అని భరోసా కల్పిస్తూ మానవతా దృక్పథంతో వాట్సప్ గ్రూప్ ద్వారా సేవలందిస్తున్న మేస్రం శేఖర్ గురువారం కలెక్టర్ రాజర్షి షా, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారికి ఆర్థికసాయం అందించడంతో పాటు 20 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ఆదివాసీ గిరిజనులు ఆస్పత్రికి వచ్చి వైద్యం చేయించుకునేలా ప్రభుత్వ ఆస్పత్రులపై వారికి నమ్మకం కలిగేలా అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

బొలెరో ఢీకొని ఒకరు దుర్మరణం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల మేరకు బోథ్ మండలంలోని సొకెరకు చెందిన కుందూరు రాజు (23), ఖుర్షీద్‌నగర్‌కు చెందిన దర్శనాల సునీల్ ద్విచక్ర వాహనంపై తిర్పెల్లి వైపు వెళ్తుండగా బొలెరో అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో రాజు సంఘటన స్థలంలోనే మృతి చెందగా సునీల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



ఆయిటి రాజు (ఫైల్)

కుంటాల: బైక్ అదుపుతప్పి యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఆయిటి రాజు (26)గురువారం రాత్రి పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై ఓలా గ్రామానికి వెళ్లి వస్తుండగా కుంటాలకు సమీపంలో సమీపాన బైక్ అదుపు తప్పి కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలఅగ్రికల్చర్: సెటిల్‌మెంట్, భూరికార్డుల కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ సర్వే ఆదేశాల ప్రకారం లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మీ సేవ కేంద్రాలలో ఈ నెల 17 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన వారికి జిల్లా ప్రధాన కేంద్రంలో 50 రోజులపాటు శిక్షన ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ గణితంలో 60 శాతం మార్కులు, ఐటీఐ, డ్రాఫ్ట్‌మెన్ (సివిల్) / డిప్లొమా సివిల్) / బీటెక్ సివిల్) సమాన అర్హత గల అభ్యర్థులు అర్హులన్నారు. ఓసీ అభ్యర్థులు రూ.10 వేలు, బీసీ అభ్యర్థులు రూ.5 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.2,500 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

'ఆర్థిక విధ్వంసం సృష్టించిందే బీఆర్‌ఎస్'



మాట్లాడుతున్న రియాజ్

నార్నూర్: తెలంగాణలో పదేళ్ల అధికారంలో ఉండి ఆర్థిక విధ్వంసం సృష్టించిందే బీఆర్‌ఎస్ అని పార్టీ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ అన్నారు. గురువారం ఏర్పాటుచేసిన జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశానికి స్వాతంత్రం తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని, రాజ్యాంగాన్ని భారత్ గౌరవిస్తుందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలు సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ పార్టీని బదనాం చేస్తున్నాయన్నారు. తప్పుడు ప్రచారం చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. అధికారులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు గౌరవం ఇవ్వాల్సిందేనన్నారు. ఇందిరమ్మ కమిటీ పారదర్శకంగా పనిచేయాలన్నారు. కార్యకర్తలు ఐక్యంగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందన్నారు. సమావేశంలో పెద్దపల్లి గ్రంథాలయ చైర్మన్ మల్లయ్య గౌడ్, కుమురం భీం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు లోఖండే దేవురావు, మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పరమేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బిర్జిలాల్, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ

మంచిర్యాలఅగ్రికల్చర్: యూపీఎస్సీ, సీఎస్‌ఏటీ 2026 (సివిల్ సర్వీసెస్) పరీక్ష కోసం 100 మంది మైనార్టీ (ముస్లి, క్రిస్టియన్,సిక్కు, బౌద్ధ, జైన, పార్సీలు) అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా అభ్యర్థులకు 33.33 శాతం, అన్ని రిజర్వుడ్ కేటగిరీలలో దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించినట్లు ఆమె పేర్కొన్నారు. స్టడీ సర్కిల్‌లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపిక పూర్తిగా మెరిట్ ప్రాతిపదకన ఉంటుందన్నారు. సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రవేశం కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని ప్రొఫెషనల్, సాధారణ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో https://cet.cgg.gov.in/tmreis వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, జూన్ 5న జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రులు, సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.5 లక్షలలోపు ఉండాలని, వివరాలకు 040–23236112 నంబర్‌లో సంప్రదించాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మెరుగైన వైద్యం కోసమే పల్లె దవాఖానాలు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



పల్లె దవాఖానా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

జన్నారం: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లో దవాఖానాలు ఏర్పాటు చేస్తోందని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. మండలంలోని కలమడుగు గ్రామంలో గురువారం పల్లె దవాఖానా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు పల్లె దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్లు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ఈ ప్రాంతంలో మరిన్ని దవాఖానాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహను కలిసి డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరామని, త్వరలో ఈ ప్రాంతంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు కాబోతోందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే వైద్య సేవలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం కలమడుగు గ్రామంలోని సిరిపల్లి బీరయ్యకు రూ.19వేలు, శ్రీనివాస్ రూ.18వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, వైద్యురాలు ఉమా శ్రీ, ఏఏఎం ప్రోగ్రామ్ ఆఫీసర్ అనిల్ కుమార్, స్థానిక పల్లె దవాఖానా వైద్యురాలు గంగాదేవి, ఎంపీడీవో హుమర్ షరీఫ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు దుర్గం లక్ష్మీనారాయణ, ఫసిహుల్లా, గ్రామ కార్యదర్శి వినోద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్

నెన్నెల: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో 'గ్రామాలకు తరలిరండి' అనే కార్యక్రమాన్ని నెన్నెల, నందులపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల స్థితిగతులు, రైతులు, కార్మికులపై పాటలు పాడుతూ ప్రజలను చైతన్యపర్చారు. విద్యార్థులంతా ప్రజల జీవన స్థితిగతులను అధ్యాయనం చేయాలన్నారు. గ్రామాల్లో పేదలకు పక్కా ఇళ్లు, రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పూర్వ ఉపాధ్యక్షుడు దుర్గం బ్రహ్మానందం, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, ఎం.గణేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మి, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి రత్నం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి: ప్రభుత్వ నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్‌లపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయకార్యదర్శి పి.వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా, కనీస నిబంధనలు పాటించకుండా వాటర్ ప్లాంట్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయన్నారు. సరిగ్గా నీటిశుద్ధి చేయకుండా వాటర్ ప్లాంట్‌ల నిర్వాహకులు నీటి వ్యాపారం సాగిస్తున్నారని విమర్శించారు. వాటర్ ప్లాంట్‌ల నిర్వహణపై ప్రభుత్వ అధికారులు ఏమాత్రం దృష్టి సారించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వెంటనే వాటర్ ప్లాంట్‌లను తనిఖీ చేసి నిబంధనలు పాటించని యాజమానులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు.